

మహోన్నతుడు ఎన్టీఆర్ : కలెక్టర్

పుట్టపర్తి రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి ఔన్నత్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన మహోన్నతుడు ఎన్టీయార్ అని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ కొనియాడారు. దివంగత ఎన్టీఆర్ 102వ జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలోని సాయిఆరామంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ చేతన్ దివంగత ఎన్టీయార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఎన్టీఆర్ అంచెలంచెలుగా ఉన్నతశిఖరాలకు ఎదిగారన్నారు. అనేక సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్ అన్నారు. పేద ప్రజల్లో రాజకీయ చైతన్యం తెచ్చి, మహిళలకు ఆస్తి కల్పించిన మహనీయుడు రామారావు అని కొనియాడారు. పేద ప్రజలకు చేసిన సేవలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా మే 28న ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించినట్లు తెలిపారు.


జిల్లా కేంద్రంలోని సాయి ఆరామంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్


హిందూపురం విష్ణు థియేటర్‌లో తినుబండారాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

థియేటర్ల తనిఖీ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరిశీలన
కనిపించని పరిశుభ్రత.. సౌకర్యాలు
అనంతలో అనుమతిలేని గౌరీ కాంప్లెక్స్
ఆగ్రహం వ్యక్తం చేసిన రెవెన్యూ అధికారులు

5

భక్తికోటి

ఖాద్రీశుడి హుండీ ఆదాయం రూ.1,10,69,573

కదిరి, మే28 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 62రోజులకు గాను రూ.1,10,69,573లు వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 72 గ్రాముల బంగారం, 668 గ్రాముల వెండి వచ్చిందన్నారు. కార్యక్రమంలో హిందూపురం డివిజన్ దేవదాయ శాఖ తనిఖీ అధికారి ఎన్. ప్రసాద్, ఏపీజీపీ బ్యాంక్ ఎంజీరోడ్డు మేనేజర్ చలపతి, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన హుండీ ఆదాయం

లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆదాయం పెరిగింది. వేసవిసెలవులు, ప్రత్యేక పర్వదినాలు, కార్యక్రమాలుండటంతో భక్తుల రద్దీ పెరిగింది. అందుకు అనుగుణంగా ఆదాయం కూడా పెరిగినట్లు ఆలయ సిబ్బంది పేర్కొన్నారు. రోజుకు దాదాపు రూ.లక్షన్నరకుపైగా ఆదాయం వచ్చిందంటున్నారు.


హుండీ లెక్కిస్తున్న భక్తులు

తెలుగుజాతి ఆత్మగౌరవానికి

ప్రతీక ఎన్టీఆర్

ఎస్పీ రత్న


ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జిల్లా ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక దివంగత నందమూరి తారక రామారావు అని జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం దివంగత ఎన్టీఆర్ 102వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు అమూల్యమైనవన్నారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, స్పెషల్‌బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐలు వలి, మహేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతలో ముగ్గురు పిల్లలు అదృశ్యం
డోన్‌లో ప్రత్యక్షం... పిలుచుకొచ్చిన పోలీసులు

5

వరద భయం

- కర్ణాటకలో పొంగిన ప్రతి చినుకూ ఇటు వైపే
- జిల్లాలో చెరువుల భద్రతపై సందేహాలు
- మరమ్మతులను వదిలేసిన గత ప్రభుత్వం
- నదులు, వంకల్లోనే నిర్మాణాలు
- పెరుగుతున్న వరద ముప్పు


గోరంట్ల వద్ద చిత్రావతి నదిలో చొచ్చుకొస్తున్న నిర్మాణాలు, రెండేళ్ల కింద హిందూపురం కొట్నూరు చెరువు వద్ద స్తంభించిన ట్రాఫిక్(ఫైల్).



పుట్టపర్తి, మే 28(ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ అధిక వర్షం హెచ్చరికల నేపథ్యంలో నది పరిసరాల్లోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలో చెరువు కట్టలు, తూములు, కాలువల మరమ్మతులను పట్టించుకోలేదు. దీంతో వాటి భద్రతపై సందేహాలు తలెత్తుతున్నాయి. ఈఏడాది ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి వరద పోటెత్తితే నదీ పరివాహక ప్రాంత ప్రజలకు ముప్పుతప్పదన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. నిధులు లేకపోవడంతో వరద వస్తే ప్రజలను అప్రమత్తం చేయడం తప్ప మరేం చేయలేని నిస్సహాయ స్థితిలో సంబంధిత అధికార యంత్రాంగం ఉంది.

ప్రతి చినుకూ జిల్లా వైపే..

జిల్లాలో ప్రవహించే ప్రధాన నదులన్నీ కర్ణాటక వైపు నుంచి వచ్చేవే. ఎగువ ప్రాంతంలో కురిసే వర్షాల ఆధారంగానే జిల్లా సరిహద్దుల్లో చెరువుల నిర్మాణం జరిగింది. కర్ణాటకలో వర్షాలు కురిస్తే పెన్నా, చిత్రావతి. కుషావతి, జయమంగళి, పెన్నకుముద్వతి, సువర్ణముఖీ నదులు జిల్లా వైపు ప్రవహిస్తాయి. చిత్రావతి, పెన్నా నదులతోపాటు వంకలు, వాగులు, ఉధృతంగా ప్రవహించి హిందూపురం, చిలమత్తూరు ప్రాంతాలలో ఉన్న చెరువులను చేరుతాయి. ప్రధానంగా కర్ణాటక సరిహద్దులో హిందూపురం, చిలమత్తూరు, లేపాక్షి, పరిగి, రొద్దం, గోరంట్ల, కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల్లో చెరువులకు వరద పోటెత్తే అవకాశం ఉంది. కర్ణాటకలో సిద్దరబెట్ట నుంచి అగళి మండలం మీదుగా సువర్ణముఖీతో కూడా పలు చెరువులకు ముప్పు ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో 1186 చెరువులుండగా పెన్నా, చిత్రావతి నదులకు అనుసంధా నంగా 500 చెరువులకుపైగా ఉన్నాయి. కర్ణాటకలో కొన్ని చెరువులు తెగితే సరిహద్దులో చెరువులపై ఒత్తిడి పడుతుంది. గత వైసీపీ ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి నిధులు ఇవ్వకపోగా వదిలేసింది. పలు చెరువుల కట్టలు చాలా చోట్ల ముళ్లపొదలతో నిండిపోయాయి. తూములు బలహీనంగా ఉన్నాయి. గతంలో వరదలు వచ్చిన సమయంలో అధికారులు సమన్వయంగా పని చేయడంతో ముప్పు తప్పింది. ఈఏడాది మేలోనే వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నది పరివాహక ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కర్ణాటక నుంచి వచ్చే ఎటువంటి వరదనైనా ఎదుర్కొంటామని చెబుతున్నా లోలోపల మాత్రం జలవనరుల శాఖలో ఆందోళన ఉంది. ఇక చాలా చోట్ల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నది, చెరువులు ఉన్న ప్రాంతాల్లో రహదారుల్లో కల్వర్టులు, వంతెనల భద్రత ఆందోళన కల్గిస్తోంది.

నదీ పరివాహక ప్రాంతాల ఆక్రమణ

జిల్లాలో చిత్రావతి, పెన్నా మొదలకుని అనుసంధానంగా ఉన్నా నదుల్లోకి జనవాసాలు విస్తరిస్తున్నాయి. ప్రధానంగా పెన్నా నది చౌళూరు నుంచి పేరూరు డ్యామ్ దాకా నది ఆక్రమణలతో నిండిపోయింది. ఇక హిందూపురం ప్రాంతాల్లో చెరువులతోపాటు నదుల్లో నివాసాలు కట్టేస్తున్నారు. చిత్రావతి నదికి కొడికొండ నుంచి సీబీఆర్ డ్యామ్‌దాకా ఇదే పరిస్థితి. గోరంట్ల, పుట్టపర్తి, ధర్మవరం ప్రాంతాల్లో చిత్రావతి కుంచించుకుపోయింది. జిల్లా కేంద్రం పుట్టపర్తిలో చిత్రావతిలోనే బహుళ అంతస్తులు వెలిసే పరిస్థితి వచ్చింది. రెండేళ్ల కింద వరద ముంపుషాక్ నుంచి తెరుకున్నా ఆపాతాలు నేర్వక మళ్లీ నదివైపే నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

అప్రమత్తం చేస్తున్నాం

ఈఏడాది వర్షాలు భారీగా కురుస్తాయనే వాతావరణశాఖ సమాచారంతో జిల్లాలోని నదీ పరివాహక ప్రాంతాలతోపాటు చెరువుల భద్రతపై సమీక్ష చేస్తున్నాం. ఎగువ ప్రాంతం కర్ణాటకలో కురిసే వర్షాలకు పెన్నా, చిత్రావతితోపాటు పలు నదుల నుంచి జిల్లాలోకి నది అనుసంధానంగా ఉన్న చెరువుల్లోకి నీరు వస్తుంది. జిల్లాలో ఎక్కడైనా చెరువుల భద్రతపై క్షేత్రస్థాయిలో పరిశీలనతోపాటు సమీక్షలు చేస్తున్నాం. అందుబాటులో ఉన్న నిధులతో యుద్ధప్రాతిపదిన మరమ్మతులతో పాటు ముళ్లపొదలు తొలగించాలని ఆదేశించాం. కర్ణాటకలో కురిసే వర్షపాతం, నదుల ప్రవాహం అక్కడ అధికారులతో ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుంటూ జిల్లాలోని చెరువులు, నదీపరివాహక ప్రాంత ప్రజల్ని అప్రమత్తం చేస్తాం.

- విశ్వనాథ్‌రెడ్డి, ఎస్ఈ, జలవనరుల శాఖ, ఉమ్మడి జిల్లా

ఉపాధి బకాయిలు

రూ.46 కోట్లు..!

- ఆరు వారాలుగా కూలీలకు అందని బిల్లులు
- పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపని వైనం
- భారంగా కుటుంబ పోషణ


చెన్నేకొత్తపల్లిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

చెన్నేకొత్తపల్లి/మడకశిర, మే 28(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కూలీలకు ఆరు వారాలుగా బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి. శ్రీసత్యసాయి జిల్లాలో రూ.46 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. పనులు చేసిన కూలీలు వేతనాల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. క్షేత్రస్థాయిలో పనులు కల్పిస్తున్నా.. బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం అవుతోంది. కూలీల (మిగతా 4లో..)

కార్యకర్తలే టీడీపీ బలం: మంత్రి సవిత

హిందూపురం, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. కడప మహానాడు వద్ద సైకిల్‌యాత్ర బృందానికి బుధవారం అభినందనలు తెలిపారు. పెనుకొండ నుంచి ఈనెల 26న బయలుదేరి బుధవారం మహానాడు ప్రాంగణానికి చేరుకున్నారు. సైకిల్‌బృందానికి మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగుతమ్ముళ్లు సైకిల్‌యాత్రతో పెనుకొండ నుంచి మహానాడుకు వచ్చారన్నారు. ఇలాంటి కార్యకర్తలు ఉండటం వల్లే పార్టీ నాలుగు దశాబ్దాలుగా విజయం సాధిస్తూ వస్తోందన్నారు. ఈ సందర్భంగా సైకిల్‌యాత్రతో వెళ్లిన కార్యకర్తలతో పరిటాల శ్రీరామ్, ఇతరనాయకులు సెల్ఫీలు తీసుకున్నారు.

పురం నుంచి మహానాడుకు తరలిన తమ్ముళ్లు

హిందూపురం నుంచి కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా 30వాహనాల్లో బుధవారం తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, పట్టణ నాయకులు అమర్, బాబీ, పరిమళ, భార్గవ్, సుమోశీన, డైమండ్‌బాబా, హెచ్ఎన్ రాము, చిలమత్తూరు శ్రీదేవి, శ్రీనివాసులు, చంద్ర, మంజునాథ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.


సైకిల్‌యాత్ర బృందానికి స్వాగతం పలికి సెల్ఫీ దిగుతున్న మంత్రి సవిత, శ్రీరామ్, అంజినప్ప

కిడ్నాపా..? అరెస్టా..?

5

దుమారం రేపుతున్న 'రత్నాకరం' భూ వివాదాలు
ఎనిమిది రోజులుగా కనిపించని సత్యనారాయణ రాజు
ప్రైవేటు వ్యక్తులు.. పోలీసుల అదుపులో సెటిల్‌మెంట్లు..?



వ్యవసాయ మంత్ర పరికరాలు..!

- సబ్సిడీ యంత్రాల్లో కంపెనీల మాయాజాలం
- ధరలు పెంచేసిన వైనం (4లో)

వేసవి దుక్కులతో భూమి సారవంతం

పేడ ఎరువులతో అధిక దిగుబడులు : ఏఓ ముస్తఫా

ధర్మవరంరూరల్, మే28(ఆంధ్రజ్యోతి): పొలాల్లో వాలుకు అడ్డంగా లోతు దుక్కులు చేసుకోవడం ద్వారా భూమి సారవంతం అవుతుందని మండల వ్యవసాయాధికారి (ఏఓ) ముస్తఫా తెలిపారు. సేద్యపు పనులపై ఆయన రైతులకు బుధవారం పలు సూచనలు చేశారు. వేసవిలో తొలకరి వర్షాలకు దుక్కులు దున్నుకోవడం వల్ల భూమి సారవంతమై కలుపుమొక్కలు, చీడపీడలను నివారించవచ్చన్నారు. ఈ వర్షాలకు లోతుగా, ఏటవాలుగా దుక్కి దున్నుకోవడం వల్ల భూమి గుల్లగా మారుతుందన్నారు. తద్వారా భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాకుండా తేమలో జీవించే సూక్ష్మజీవులు, వానపాముల సంతతి వృద్ధి చెందుతుందన్నారు. అలాగే దుక్కులు లోతుగా దున్నితే భూమిలో ఉండే పురుగులు వాటి గుడ్లు పంటనాశకాలు, ఎండవేడిమికి నశిస్తాయన్నారు. ముందస్తుగా వర్షాలు కురుస్తుండటంతో ఈ ఏడాది మండలంలోని వేరుశనగ, అంతర పంటల సాగుపై రైతుల్లో ఆసక్తి నెలకొందన్నారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో కురిసిన వర్షాలకు దుక్కిదున్నే సేద్యపు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారన్నారు. కొంతమంది రైతులు దుక్కులు వేస్తుండగా.. మరికొందరు దుక్కులు దున్నేముందు పొలాలకు ఎరువులు తోలుకుంటున్నారన్నారు. కనీసం రెండుసార్లు భూమి దున్నుకుంటే పంటకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన సూచిస్తున్నారు. దుక్కులు వేసేముందు రైతులు పొలాలకు పశువుల పేడ, కంపోస్టు ఎరువులు, చెరువు మట్టి వేసుకుంటే భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని ఆయన వివరించారు



చిగిచెర్ల వద్ద ట్రాక్టర్‌తో లోతు దుక్కులు చేస్తున్న దృశ్యం, ధర్మవరం ఏఓ ముస్తఫా

మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తాం

మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా


బాధ్యతలు చేపడుతున్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు

కదిరి, మే 28 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా పేర్కొన్నారు. చైర్‌పర్సన్‌తోపాటు వైస్ చైర్మన్లు సేగు సుధారాణి, మద్దెపల్లి రాజశేఖరాచారి బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తమకు అవకాశం కల్పించారని, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. మున్సిపాలిటీలో కౌన్సిలర్లు, అధికారులను సమన్వయం చేసుకుని ముందుకెళ్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ అధ్యతన జరిగిన ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కిన్నెర కళ్యాణ్, షానూ, టీడీపీ నాయకులు కెఎస్. బాహుద్దీన్, సేగు బాబయ్య, పలువురు మున్సిపల్ సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లను పలువురు సత్కరించారు.

జిల్లాకు ఐఫోన్ కంపెనీ..?

బండ్లపల్లి వద్ద భూ సేకరణకు రెవెన్యూ అధికారుల సన్నద్ధత

మూడు రెవెన్యూ పొలాల్లో 1700 ఎకరాలు గుర్తింపు


ఏపీఐఐసీ గుర్తించిన భూమి మ్యాప్‌లో..

కొత్తచెరువు, మే 28(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఐఫోన్ కంపెనీ రానున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే బండ్లపల్లి వద్ద 1600 నుంచి 1700 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి అప్పగించేందుకు రెవెన్యూ అధికారులు భూ సేకరణను చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ భూసేకరణ చేపట్టినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కదిరేపల్లి, బండ్లపల్లి, విరుపాపురం ప్రాంతాలలో 1600 ఎకరాల నుంచి 1700 ఎకరాలను రెవెన్యూ మ్యాప్ ప్రకారం గుర్తించినట్లు సమాచారం. త్వరలోనే భూసేకరణ చేపడతామని తహసీల్దార్ నీలకంఠారెడ్డి తెలిపారు. ప్రపంచ దిగ్గజ కంపెనీ అయిన ఐఫోన్ జిల్లాలో ఏర్పాటైతే సమీప ప్రాంతంలోని యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు మెండుగా ఉంటాయి. రైతులు కూడా తమ భూముల వివరాలను రెవెన్యూ అధికారులకు అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలో కియ కార్ల పరిశ్రమ, జాతీయ రహదారులు ఉండటం, అంతర్జాతీయ విమానాశ్రయం కూడా సమీపంలో ఉండటంతో ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడంతో పాటు వివిధ రకాల రాయితీలు ఇస్తుండటం కూడా పారిశ్రామికవేత్తలు ఇటువైపు మొగ్గడానికి కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. దీనిపై సర్వేయర్‌సురేష్‌ను అడగ్గా కొత్తచెరువు మండల పరిధిలోని బండ్లపల్లి సమీపంలో భూములను గుర్తించి ఏపీఐఐసీకి అప్పచెప్పేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు. కదిరేపల్లి రెవెన్యూ పొలంలో 330 ఎకరాలు, విరుపాపురం రెవెన్యూ పరిధిలో 370 ఎకరాలు, బండ్లపల్లి రెవెన్యూ పరిధిలో 1002 ఎకరాలు గుర్తించినట్లు తెలిపారు.

అధైర్యపడవద్దు

వీరజవాన్ కుటుంబానికి బీజేపీ నాయకుల పరామర్శ

గోరంట్ల, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్లితండాలో వీరజవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని బీజేపీ రాష్ట ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. సంఘటన జరిగిన సమయంలో తాను విదేశాల్లో ఉండటంతో రాలేకపోయినట్లు విష్ణువర్ధన్‌రెడ్డి జవాన్ తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరామునాయక్‌కు తెలిపారు. అధైర్యపడవద్దని, కేంద్రం నుంచి అన్ని విధాలా సాయం అందేలా చూస్తామన్నారు. వీరజవాన్ విగ్రహం ఏర్పాటు విషయంలో తోడ్పాటు అందిస్తామన్నారు. జవాన్ ఘాట్‌ను సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్, ఉత్తమరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చంటి, హరినాయక్, నాగార్జున, కన్వీనర్‌బోయ లక్ష్మీనారాయణ, మేదర్ శీనా, శంకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శంకర్, చలం తదితరులున్నారు.


వీరజవాన్ తల్లిదండ్రులను పరామర్శిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, జీఎం శేఖర్ తదితరులు



వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ



వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు



వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం



మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..





పసుపు జాతర

రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.







మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు







నోరూరించే వంటలు రెడీ...



మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ



అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు



మేము విజిలేస్తే...



కార్యకర్తల ఉత్సాహం..



రక్తదానం చేస్తున్న కార్యకర్తలు



పోలీసు తనిఖీలు

ఉపాధి బకాయిలు రూ.46 కోట్లు..!

(3వ పేజీ తరువాయి)

సంఖ్యను పెంచాలని అధికారులు లక్ష్యాన్ని నిర్ధేశిస్తున్నారే తప్ప.. అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో ఉపాధి పనులు ఊపందుకున్నాయి. చాలావరకు కరువు మండలాల్లో ఉపాధి పథకం కూలీలకు ప్రధాన ఆధారంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో పెద్దఎత్తున పనులు చేసినా నెలల తరబడి బిల్లులు నిలిచిపోవడం కూలీలకు తీవ్ర నిరాశ మిగుల్చుతోంది.

ప్రభుత్వం ఆదుకోవాలి

-వెంకటరమణ, హెచ్‌టీ హళ్లి

ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసి ఆరు వారాలైంది. ఇంతవరకూ కూలి డబ్బులు ఖాతాలోకి జమకాలేదు. ఇంతకు మునుపు వారానికి, రెండు వారాలకు బిల్లులు ఖాతాలోకి జమ చేసేవారు. ఇప్పుడు బిల్లులు రాకపోవడంతో జీవనానికి ఇబ్బంది పడాల్సివస్తోంది. పనులు చేసేచోట వసతులు లేవు. ప్రభుత్వం ఉపాధి కూలీలను ఆదుకోవాలి.



రూ.కోట్లలో ఆగిపోయిన చెల్లింపులు..

శ్రీసత్యసాయి జిల్లాలోని మొత్తం 32 మండలాల్లో ఈ ఏడాది ఏప్రిల్ మూడో వారం నుంచి ఇప్పటివరకు ఉపాధి హామీ కింద పలు రకాల పనులు చేశారు. ఇందుకు సంబంధించి రూ.46 కోట్ల బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి. వేతనాలు అందక చాలామంది కూలీలు పనులకు వెళ్లడానికి ముఖం చాటేసే పరిస్థితి నెలకొంది. ఉపాధి పనులు మొదలైన ప్రారంభంలో ఉన్న కూలీల సంఖ్య మే నెల వచ్చేసరికి తగ్గుతోందని సంబంధిత అధికారులే చెబుతున్నారు. బిల్లులు చెల్లించకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

ఆరువారాల నుంచి..

మడకశిర నియోజకవర్గంలో ఈఏడాది ఏప్రిల్ 14 నుంచి ఇప్పటి వరకూ చేసిన ఉపాధి పనులకు బిల్లులు రాలేదని కూలీలు వాపోతున్నారు. మడకశిర క్లస్టర్ పరిధిలోని కూలీలకు రూ.5కోట్ల దాకా బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం. ప్రతిరోజూ 11వేల మంది కూలీల పనులకు వస్తున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. పనులు చేసే చోట కనీస సౌకర్యాలు లేవని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు బిల్లుల రాకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉందని కూలీలు వాపోతున్నారు. ఈనేపథ్యంలో మళ్లీ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

ఇలాగైతే పనులకు వెళ్లం..

వారాలకొద్దీ బిల్లులు ఇవ్వకపోతే ఏం చేయాలి? అదిగో.. ఇదిగో.. బిల్లులు వస్తాయని చెబుతూ అధికారులు పనులు చేయిస్తున్నారు. బిల్లులు మాత్రం పడటం లేదు. ఇలాగైతే పనులకు వెళ్లం.

- ఓబులమ్మ, కూలీ, మాల్యవంతం





బిల్లులు వెంటనే ఇవ్వాలి

పనులు చేసినా ఇంతవరకు బిల్లులు రాలేదు. రోజూ క్రమం తప్పకుండా పనులకు వెళ్తున్నాం. బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే బిల్లులు ఇవ్వాలి.

- చెన్నకేశవులు, ఉపాధి కూలీ, చెన్నేకొత్తపల్లి

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం

పనులు చేసినా బిల్లులు ఇవ్వడంలేదు. వేరే పనులకు వెళ్దామంటే దొరకడంలేదు. గత్యంతరంలేక ఉపాధి పనులకే వెళ్తున్నాం. బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నాం.

-సాకే సుబ్బరాయుడు, కనగానపల్లి





మడకశిర ప్రాంతంలో ఉపాధి పథకం ద్వారా పనులు చేస్తున్న కూలీలు

రూ.46 కోట్లు చెల్లించాలి

ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు ఆరు వారాలకు సంబంధించి బిల్లులు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో 2.5 లక్షల మంది కూలీలకు రూ.46 కోట్లు బిల్లులు చెల్లించాలి. త్వరలోనే పనులు చేసిన కూలీలందరికీ బిల్లులు వారి ఖాతాలోకి జమ అవుతాయి.

-విజయేంద్రప్రసాద్, పీడీ, ఎన్ఆర్ఈజీఎస్

వ్యవసాయ మంత్ర పరికరాలు..!

- సబ్సిడీ యంత్రాల్లో కంపెనీల మాయాజాలం
- ధరలు పెంచేసిన వైనం
- మార్కెట్ ధరల కన్నా అధికం
- రాయితీ ఇచ్చినా ప్రయోజనం లేదంటున్న రైతులు
- పరికరాలకు స్పందన అంతంతే..

రోటావేటర్ ధరను ప్రభుత్వం రూ.80 వేల నుంచి రూ.1.50లక్షల వరకు మార్గదర్శకాల్లో పేర్కొంది. దీనిపై రైతుకు రూ.50 వేల వరకు సబ్సిడీ వర్తిస్తుంది. రాయితీ పోనూ రైతు చెల్లించే మొత్తం కలుపుకుంటే ఈ ధర బయట మార్కెట్ కన్నా రూ.30 వేలు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో రైతులు సబ్సిడీ వచ్చినా.. చెల్లించే మొత్తం దాదాపు బయటి ధరకు సమానంగా ఉంటున్నట్లు తెలుస్తోంది.

ట్రాక్టర్ కల్టివేటర్ ధరను రూ.43 వేలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో సబ్సిడి పోనూ రైతు రూ.21 వేలకు చెల్లించాల్సి ఉంటుంది. బహిరంగ మార్కెట్లో వీటిని తూకం బట్టి ఇస్తారనీ, ఇది అంత ధర ఉండదనేది రైతుల అభిప్రాయం.

బ్యాటరీ స్ప్రేయర్ ప్రభుత్వ ధర రూ.26 వేలు ఉండగా.. రూ.10వేలు సబ్సిడీ పోనూ రైతులు రూ.16 వేలు డీడీ ద్వారా జమ చేయాలి. ఇదే బహిరంగ మార్కెట్లో ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రూ.5వేల వరకు తక్కువగా ఉంటుందని అంటున్నారు. దీనిని ఎక్కువగా చూపించి కంపెనీలు రైతులకు దగా చేస్తున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



బొమ్మనహాళ్, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై అందించే వ్యవసాయ యంత్ర పరికరాల ధరల్లో కంపెనీలు మాయాజాలం ప్రదర్శిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సబ్సిడీకి అనుగుణంగా ధరలు పెంచేసి దగా చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. సబ్సిడీపోనూ రైతు చెల్లించే ధర.. బయటి మార్కెట్ రేటుకు దాదాపు సమానంగా ఉంటున్నట్లు వారు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి ప్రయోజనం లేదని ఆవేదన చెందుతున్నారు. ఈనేపథ్యంలో వ్యవసాయ యంత్ర పరికరాలు తీసుకునేందుకు ఆసక్తి చూపట్లేదు. వెరసి.. నిర్ధేశిత లక్ష్యం అధిగమించేందుకు ఆపసోపాలు పడుతున్నారు. పదేపదే గడువు పొడిగిస్తున్నా.. రైతులు ఆసక్తి చూపట్లేదు. పరికరాల ధరలపై కంపెనీలతో ప్రభుత్వం చర్చించి, తమకు న్యాయం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

పదేపదే పొడిగించినా..

పంటల సాగులో కూలీల ఖర్చు తగ్గించేందుకు రైతులకు యాంత్రీకరణ పరికరాలను ప్రభుత్వం అందజేస్తోంది. ఐదెకరాల కన్నా తక్కువ ఉన్న రైతులకు వాటిని ప్రభుత్వం అందజేస్తుంది. సాధారణంగా సబ్సిడీ పరికరాల కోసం రైతాంగం నుంచి భారీ సంఖ్యలో దరఖాస్తులు రావాల్సి ఉంది. అనూహ్యంగా ఈసారి స్పందన అంతంతమాత్రంగానే ఉంది. నిర్ధేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికే అధికారులు తంటాలు పడుతున్నారు. బొమ్మనహాళ్ మండలానికి 23 పరికరాలు మంజూరయ్యాయి. 12 స్ప్రేయర్లు, 2 రోటావేటర్లు, 5 బ్యాటరీ స్ప్రేయర్లు, 4 ట్రాక్టర్లు రైతులు తీసుకున్నారు. తొలిసారి మంజూరు చేసిన వాటిని మాత్రం తీసుకున్నారు. తర్వాత ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. వ్యవసాయ పరికరం ధరను బట్టి ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు సబ్సిడీ వర్తింపజేస్తుంది. ఇక్కడే సదరు యంత్రాలను సరఫరా చేసే కంపెనీలు మాయాజాలం చేస్తున్నట్లు తెలుస్తోంది. సబ్సిడీ మొత్తం పోనూ రైతు చెల్లించే ధర కలుపుకుంటే బయట మార్కెట్ కన్నా ఎక్కువగా ఉందని రైతులు అంటున్నారు. వాస్తవానికి ఇది ప్రభుత్వ ఖజానాకు గండికొట్టడమే. బ్రాండెడ్, గ్యారెంటీల ముసుగుతో కొటేషన్లు ఎక్కువగా ఇచ్చి కంపెనీల డీలర్లు దోచుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ధరలు బేరీజు వేసుకున్న రైతాంగం సబ్సిడీ యంత్ర పరికరాలపై ఆసక్తి చూపట్లేదు. మండలాల వారీగా అధికారులకు లక్ష్యాలు ఇచ్చి, వాటిని పూర్తి చేయాలని మెడ మీద కత్తిపెట్టి వ్యవసాయ శాఖ పనిచేయించింది. మార్చి ఆఖరుకే గడువు విధించారు. రైతుల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో ప్రభుత్వం గడువు పొడిగించుకుంటూ వచ్చింది. ఈనెల మొదటి వారంలో దరఖాస్తుల ప్రక్రియను వ్యవసాయశాఖ నిలిపివేసింది. సబ్సిడీ కోసం ఎగబడాల్సిన రైతులు దానిని కాదనుకునేలా వ్యవహరించడం వెనుక ఉన్న కారణాలపై దృష్టి పెట్టే పని వ్యవసాయ శాఖ చేయలేదు. సబ్సిడీపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవస్థల వైఫల్యం కూడా ప్రస్తుత పరిస్థితికి కారణంగా ఉంది. అన్నదాతల దగ్గర డబ్బు లేకపోవడం కూడా ఇందుకు కారణమనే వాదన ఉంది.

మార్కెట్‌లో కంటే ఎక్కువగా ధరలు

రోటావేటరకు దరఖాస్తు చేసుకున్నా.. ధర బయట మార్కెట్‌లో కంటే ఎక్కువగా ఉంది. ధరలపై కంపెనీలతో ప్రభుత్వం చర్చించి, బయట మార్కెట్ కంటే తక్కువకు ఇస్తే బాగుంటుంది.

-ప్రకాష్, రైతు, హరేసముద్రం



ధరలు ఎక్కువగా ఉన్నాయి

వ్యవసాయ యంత్ర పరికరాల ధరలు ఎక్కువగా ఉన్నాయి. స్ప్రేయర్ ధర బయట మార్కెట్ కంటే ఎక్కువగా ఉంది. నాణ్యత ఏ మాత్రం ఉన్నాయో తెలియడం లేదు.

- నిరంజన్, రైతు, బొమ్మనహాళ్





కేంద్రహోంశాఖ సహాయమంత్రిని కలిసిన మంత్రి సత్యకుమార్ యాదవ్

ఆర్డీటీకి సహకరించండి

కేంద్రమంత్రిని కోరిన రాష్ట్ర మంత్రి సత్యకుమార్

ధర్మవరం, మే 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఆర్డీటీకి కేంద్రం సహకరించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కోరినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కేంద్రమంత్రిని బుధవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన కీలక అంశాలపై చర్చించారు. ఈక్రమంలోనే అనంతపురం జిల్లా కేంద్రంగా 55 ఏళ్ల పాటు విశేష సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ ఆర్డీటీ గురించి ప్రస్తావించినట్లు మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. ఈ సంస్థకు సంబంధించి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖలతో సంప్రదించి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు మంత్రి సత్యకుమార్‌యాదవ్ వెల్లడించారు.

మద్యం మత్తులో భార్యను పొడిచిన భర్త

గుమ్మఘట్ట, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనబావి గ్రామంలో బుధవారం రాత్రి మద్యం మత్తులో దళిత సాల్మాన్ తన భార్య శాంతమ్మ(38)ను కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. అడ్డు పడిన 14 ఏళ్ల క్రాంతిని సైతం కత్తితో గాయపరిచాడు. గత కొంత కాలంగా మద్యం సేవించి కుటుంబ పోషణను పట్టించుకోకపోవడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో భార్య భర్తల మధ్య తగాదాలు పెరిగి సాల్మాన్ భార్య శాంతమ్మపై ఇంట్లో ఉన్న కత్తితో పొడిచి గాయపరిచాడు. వెంటనే ఇరుగుపొరుగువారు సమీప బంధువులు గాయపడిన శాంతమ్మ, కూతురు క్రాంతిని చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



చికిత్స పొందుతున్న శాంతమ్మ

అనంతలో ముగ్గురు చిన్నారుల అదృశ్యం

డోన్‌లో ప్రత్యక్షం... పిలుచుకొచ్చిన పోలీసులు



సీసీ పుటేజీలో చిన్నారులు

అనంతపురం క్రైం, మే 28(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆడుకోవడానికి వెళ్లిన ముగ్గురు పిల్లలు అదృశ్యమయ్యారు. బస్సు ఎక్కి గంటల వ్యవధిలో జిల్లాను దా టేశారు. ఇంటికొచ్చిన తల్లిదండ్రులకు పిల్లలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. డోన్‌లో ఉన్నట్లు కనుగొన్న పోలీసులు పిల్లలను తెచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా... నగరంలోని షిర్డీనగర్‌లో అర్జున్, మీనాక్షి దంపతులు నివాసముంటున్నారు. అర్జున్ రోల్డ్‌గోల్డ్ వస్తువులు తీసుకొచ్చి పల్లెల్లో విక్రయిస్తుంటాడు. మీనాక్షి స్థానికంగా ప్లాస్టిక్ ఫ్లవర్‌షాపు పెట్టుకుని జీవనం సాగిస్తోంది. వీరికి 12ఏళ్ల అక్షర, ఎనిమిదేళ్ల అశ్వత్థ సంతానం. పిల్లలకు వేసవి సెలవులు కావడంతో బుధవారం ఉదయం ఇంటి ఎదుట ఆడుకుంటున్నారు. అర్జున్ ఉదయం 6గంటలకు, మీనాక్షి 8.15గంటలకు తమ పనుల నిమిత్తం వెళ్లారు. అర్జున్ 9గంటల సమయంలో ఇంటికి వచ్చి చూస్తే పిల్లలు కనిపించలేదు. దీంతో భార్య మీనాక్షికి ఫోన్ చేశాడు. దీంతో ఆందోళన చెందిన ఇద్దరూ పిల్లల కోసం వెతికారు. అదే సమయంలో వారి ఇంటి పక్కనున్న ఎనిమిదేళ్ల షాహీదా కూడా కనిపించకపోవడంతో తల్లిదండ్రులు వెతకడం మొదలుపెట్టారు. దీంతో ఎక్కడున్నారోనని బస్టాండ్, రైల్వేస్టేషన్లు వెతికారు. కనిపించకపోవడంతో వారు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శాంతిలాల్, ఎస్‌ఐ శరత్‌చంద్ర, సిబ్బందిని అప్రమత్తం చేశారు.

డోన్ బస్టాండ్‌లో ప్రత్యక్షం

పిల్లలు అదృశ్యమయ్యారన్న విషయం తెలుసుకున్న సీఐ శాంతిలాల్ ఇంటి వద్దకు వెళ్లి ఆరా తీశారు. చుట్టుపక్కల ఆడుకునే పిల్లలతో మాట్లాడారు. మాటల క్రమంలో ఆ ముగ్గురిలో అక్షర, అశ్వత్థ తమ అమ్మ కొడుతోందని ఊరికి వెళ్తున్నామని చెప్పారట. ఏ ఊరు అని అడిగితే డోన్ మా ఊరు...అక్కడికెళ్తున్నాం అని చెప్పారట. మీనాక్షి సొంతూరు డోన్. పిల్లల కోసం తల్లిదండ్రులు అప్పుడప్పుడు ఇచ్చే డబ్బు తీసుకుని ఇంటి నుంచి బయటకు వచ్చారు. నేరుగా ఆ ముగ్గురూ బస్టాండ్‌కు వెళ్లారు. షాహీదాకు ఏమీ తెలియకుండానే వారిని అనుసరించింది. ముగ్గురూ డోన్‌కు వెళ్లారు. అక్కడ దిగి బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నారు. సీఐ శాంతిలాల్, సిబ్బంది సీసీ ఫుటేజీలు పరిశీలించగా పిల్లలు బస్టాండ్‌కు వెళ్లడం కనిపించింది. సీఐ ఆదేశాలతో పోలీసులు నేరుగా డోన్‌కు వెళ్లి పిల్లలను పిలుచుకొచ్చారు. వారిని తల్లిదండ్రులకు అప్పగించడంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

యువతి అదృశ్యం.. ఆచూకీ లభ్యం

అనంతపురం విద్యుత్‌నగర్‌లో నివాసముంటున్న నాగభూషణం కుమార్తె సాకే సాహిత్య మంగళవారం రాత్రి ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. బంధువుల ఇంట్లో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాహిత్య మానసిక స్థితి సరిగా లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ లభించిందని బుధవారం అర్ధరాత్రి సీఐ శ్రీకాంత్ తెలిపారు.

పెనుకొండలో అక్కాచెల్లెలు..





అదృశ్యమైన తహసీన్, ఫిర్దోస్

పెనుకొండ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క మాన్ వీధిలో నివాసముంటు న్న షేక్ రియాజ్ కుమార్తెలు తహసీన్, ఫిర్దోస్ కనిపించకుం డా పోయారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. షేక్ రియాజ్ ఐస్ క్రీం వ్యాపారం, అతడి భార్య నూర్జహాన్ కుట్టుమిషన్‌తో జీవనం సాగిస్తున్నారు. వీరికి తహసీన్, ఫిర్దోస్, మరో కుమార్తె ఉన్నారు. మంగళవారం హిందూపురంలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వచ్చారు. ఈ క్రమంలో అదేరోజు సాయంత్రం నుంచి తహసీన్, ఫిర్దోస్ కనిపించకుండా పోయారు. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బెళుగుప్పలో ఇద్దరు..





అదృశ్యమైన మహేష్, చామంతి

బెళుగుప్ప, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇద్దరి అదృశ్యంపై కేసులు నమోదు అయినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. శీర్పి గ్రామానికి చెందిన ఎం మహేష్ (34), ఈనెల 20న బ్యాంకులో పంట రుణాల రెన్యువల్ చేయడానికి కళ్యాణదుర్గం వెళుతున్నట్లు చెప్పి వెళ్లాడు. ఇంతవరకు ఇంటికి రాలేదు. బంధువుల ఊర్లల్లో కూడా లేరని భార్య రూప పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. హనిమిరెడ్డిపల్లికి చెందిన చామంతి జ్యోతి (30) ఈనెల 27న ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఆమె మామ కృష్ణప్ప ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ శివ కేసు నమోదు చేశారు.

రైతు ఆత్మహత్య

ధర్మవరం రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన రైతు జ్వాలా లక్ష్మిరెడ్డి(60) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు... జ్వాలా లక్ష్మిరెడ్డి ఈనెల 26న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదన్నారు. కుటుంబ సభ్యులు పొలం వద్ద, బంధువుల ఇళ్ల వద్ద ఆరాతీసినా కనిపించలేదు. వ్యవసాయ పొలం సమీపంలో ఉన్న వంకలో కంప చెట్టుకు ఉరి వేసు కుని మృతి చెందిన లక్ష్మిరెడ్డిని గొర్రెల కాపరులు బుధవారం గుర్తించారు. వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లడంతో మూడురోజుల కిందటే ఉరి వేసుకున్నట్లు పోలీసులు భావించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ఆత్మహత్య కారణాలు తెలియరాలేదు.

అనారోగ్యంతో మనస్తాపం చెంది ఆర్టీసీ డ్రైవర్..

నల్లచెరువు(కదిరి), మే 28(ఆంధ్రజ్యోతి): నల్లచెరువులోని వీవర్స్‌కాలనీకి చెందిన ఆర్టీసీ డ్రైవర్ సుధాకర్ (43) అనారోగ్యంతో మనస్తాపం చెంది బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుధాకర్ ఆర్టీసీ హిందూపురం డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తుండేవారు. రెండు నెలలుగా వెన్ను, కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. దీంతో మెడికల్ లీవ్ పెట్టాడు. సుధాకర్ భార్య అనితమ్మ.. ఇద్దరు కుమార్తెలతో పుట్టింటికెళ్లింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో సుధాకర్ పైకప్పునకు ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, శవాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సుధాకర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేశారు.

థియేటర్ల తనిఖీ

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పరిశీలన
- కనిపించని పరిశుభ్రత.. సౌకర్యాలు
- అనంతలో అనుమతిలేని గౌరీ థియేటర్
- ఆగ్రహం వ్యక్తంచేసిన రెవెన్యూ అధికారులు



తాడిపత్రిలో సాయితేజ థియేటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు



గుంతకల్లు థియేటర్‌లో టిక్కెట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి



బొమ్మనహాళ్‌లో థియేటర్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలోని సినిమా థియేటర్లను రెవెన్యూ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు థియేటర్లలో సౌకర్యాలు, భద్రత, టిక్కెట్ల ధరలు, ఆహార పదార్థాల నాణ్యత, ధరలు, అనుమతులు.. ఇలా అన్ని అంశాలను పరిశీలించారు. చాలా థియేటర్లలో సౌకర్యాలు లేవని గుర్తించారు. పద్ధతిగా నిర్వహించాలని హెచ్చరించారు. తినుబండారాల ధరల వివరాలను ప్రదర్శించాలని ఆదేశించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

- అనంతపురంలో తహసీల్దారు హరికుమార్‌తో కలిసి ఆర్డీఓ కేశవనాయుడు గౌరీ కాంప్లెక్స్‌ను తనిఖీ చేశారు. గత ఏడాదే అనుమతి పూర్తి అయినట్లు గుర్తించారు. రెన్యువల్ చేసుకోవాలని నోటీసులు జారీ చేసినా స్పందించలేదని ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫైర్ సర్టిఫికెట్ కూడా లేదని అన్నారు. పార్కింగ్, పరిశుభ్రత, ధరలలో లోపాలు ఉన్నాయని, కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని తెలిపారు.
- సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారు రామక్రిష్ణ సిబ్బందితో కలిసి త్రివేణి కాంప్లెక్స్‌లో తనిఖీలు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ మంజునాథ్ సిబ్బందితో కలిసి ఎస్వీ థియోటర్‌లో తనిఖీలు చేశారు. ఆర్‌ఐ సందీప్ సిబ్బందితో కలిసి శాంతి థియోటర్ కాంప్లెక్స్‌ను తనిఖీ చేశారు. వీరందరూ నివేదికలను తహసీల్దారు హరికుమార్‌కు సమర్పించారు.
- కళ్యాణదుర్గంలో మూడు సినిమా థియేటర్లను వీఆర్వో కార్తీక్‌తో కలిసి తహసీల్దార్ భాస్కర్ తనిఖీ చేశారు. ప్రేక్షకులు రాకపోవడంతో 15 రోజుల నుంచి మూసివేశామని నిర్వాహకులు వారికి తెలియజేశారు.
- ధర్మవరంలోని రంగా సీనీ కాంప్లెక్స్‌ను ఆర్డీఓ మహేష్ తనిఖీ చేశారు. తినుబండరాలను, వాటి ధరలను పరిశీలించారు. ధరల పట్టిక లేకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
- గుంతకల్లులో థియేటర్లను తహసీల్దారు రమాదేవి తనిఖీ చేశారు. అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌ఐ హరిప్రసాద్, వీఆర్వోలు కృష్ణ, శ్రీకాంత్, చిట్టిబాబు, సాయి తనిఖీల్లో పాల్గొన్నారు.
- రాయదుర్గంలో మధు, ప్యాలెస్ టాకీస్‌లను తహసీల్దార్ నాగరాజు తనిఖీ చేశారు. మధు టాకీస్ నెలరోజుల నుంచి మూతపడి ఉందని, ప్యాలెస్ టాకీస్‌లో కొన్ని ఉల్లంఘనలు గుర్తించామని తెలిపారు. ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు.
- కణేకల్లు చిక్కణ్ణేశ్వర థియేటర్‌ను ఇన్‌చార్జి తహసీల్దారు నాగరాజు బుధవారం తనిఖీ చేశారు. కలెక్షన్లు లేకపోవడంతో 20 రోజుల నుంచి మూసివేసినట్లు గుర్తించారు.
- బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లో సినిమా థియేటర్‌ను తహసీల్దార్ మునివేలు, డీటీ శ్యామ్ తనిఖీ చేశారు. లోపాలను గుర్తించి, పలు సూచనలు చేశారు.
- పామిడిలోని హనుమాన్, మంజు థియేటర్లను తహసీల్దార్ శ్రీధర మూర్తి తనిఖీ చేశారు. సీటింగ్ కెపాసిటీ, తినుబండారాలు, లైసెన్స్, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. రీసర్వే డీటీ విజయ్, వీఆర్వో నాగప్ప పాల్గొన్నారు.
- ఉరవకొండలో మూడు సినిమా థియేటర్లను రీసర్వే డీటీ పవన్, ఆర్‌ఐ రామకృష్ణ, వీఆర్వోలు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

కిడ్నాపా..? అరెస్టా..?

దుమారం రేపుతున్న 'రత్నాకరం' భూవివాదాలు

ఎనిమిది రోజులుగా కనిపించని సత్యనారాయణరాజు

ప్రైవేటు వ్యక్తులు.. పోలీసుల అదుపులో సెటిల్‌మెంట్లు..?

పుట్టపర్తి, మే 28(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రానికి చెందిన గోకులం రత్నాకరం సత్యనారాయణరాజు అనే రియల్టర్ 'కిడ్నాప్' వ్యవహారం కలకలం రేపుతోంది. భూ వివాదాలు, బినామీ వ్యవహారాల నేపథ్యంలో ఎనిమిది రోజులుగా కొందరు ప్రైవేటు వ్యక్తులు, పోలీసులు సత్యనారాయణ రాజును అదుపులో ఉంచుకుని సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తున్నారు. 'పోలీస్ స్టేషన్‌కు వెళితే పట్టించుకోవడం లేదు. ఫిర్యాదును స్వీకరించడం లేదు. మా అన్న ఏమయ్యాడో తెలియడం లేదు' అని సత్యనారాయణ సోదరుడు ఆంధ్రజ్యోతిని బుధవారం రాత్రి ఆశ్రయించారు. సత్యనారాయణరాజు పేరుమీద పుట్టపర్తిలో కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయని సమాచారం. ఆ భూములపై కన్నేసిన పుట్టపర్తికి చెందిన కొందరు ఈ నెల 20న కిడ్నాప్ చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సత్యనారాయణరాజు బుధవారం తన తల్లికి ఫోన్ చేసి, తన పేరిట ఉన్న విలువైన భూమిని బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని విలపించినట్లు తెలిసింది. పది రోజులుగా తన కుమారుడు కనిపించడం లేదని, కాపాడాలని కుటుంబ బుధవారం సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పోలీసులే ఈ నెల 20న దగ్గరుండి తీసుకెళ్లారని వారు ఆరోపిస్తున్నారు. సత్యనారాయణ రాజును చూపించాలని పోలీసులను అడిగితే పొంతనలేని సమాధానలు చెబుతున్నారని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చిత్రహింసలు..?

ఏదైనా కేసులో నిందితుడిగా సత్యనారాయణ రాజును పోలీసులు అదుపులోకి తీసుకుంటే 24 గంటల్లోగా కోర్టు ఎదుట హాజరుపరచాలి. దర్యాప్తు కోసం కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకోవచ్చు. ఇవేవీ కాదనుకుంటే కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు స్వీకరించి ఏమయ్యాడో కనిపెట్టాలి. కానీ ఎనిమిది రోజులు అవుతున్నా ఈ వ్యవహారంలో నోరు మెదపడం లేదు. కుటుంబ సభ్యులు చెబుతున్న వివరాల ప్రకారం సత్యనారాయణరాజు అదృశ్యం వెనుక కొందరు పోలీసులతోపాటు ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం కనిపిస్తోంది. అతన్ని చిత్రహింసలు పెట్టి ఆస్తులు రాయించుకున్నారనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

బినామీ వ్యవహారాలు కూడా..

పుట్టపర్తికి వచ్చే బాబా భక్తుల్లో కొందరు విదేశీయులకు సత్యనారాయణరాజు బినామీగా ఉన్నాడని ప్రచారం జరుగుతోంది. వారి తరపున పుట్టపర్తిలో భూములు కొనుగోలు చేశాడని, అవి రూ.కోట్లు పలుకుతుండటంతో తిరిగి అప్పగించకుండా సత్యనారాయణరాజు ఎదురు తిరిగాడని అంటున్నారు. బినామీ వ్యవహారాలు చట్ట వ్యతిరేకం కావడంతో సెటిల్‌మెంట్‌ల దిశగా వ్యవహారాలు నడిపిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కిడ్నాప్, బెదిరింపులు, చిత్రహింసలు, బలవంతపు రిజిస్ట్రేషన్‌లు వంటి ఆరోపణలు వస్తున్నాయి. ఈ తతంగంలో పోలీసు శాఖకు మరకలు అంటుతున్నాయి.

మా వద్దే ఉన్నాడు..



విజయ్‌కుమార్, డీఎస్పీ

పోలీసులు ఈ నెల 20న సత్యనారాయణరాజును విచారణ పేరుతో తీసుకువెళ్లినట్లు సమాచారం. ఇన్ని రోజులుగా అరెస్టు చూపకపోవడం విమర్శలకు, అనుమానాలకు తావిస్తోంది. సత్యనారాయరాజును అరెస్టు చేశారా..? కిడ్నాప్ అయ్యారా..? అని పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్‌ను వివరణ కోరగా, తమ అదుపులో ఉన్నాడని బుధవారం రాత్రి తెలిపారు. అమెరికాకు చెందిన అరవిన్ ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేశామని తెలిపారు. సత్యనారాయణ రాజును బినామీగా పెట్టుకుని అరవిన్ పుట్టపర్తిలో భూములు కొనుగోలు చేశారని తెలిపారు. విదేశాల నుంచి రూ.8.5 కోట్ల లావాదేవీలు సత్యనారాయణరాజు ఖాతా నుంచి జరిగాయని తెలిపారు. అందుకే సత్యనారాయణరాజును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. అమెరికా, జర్మనీకి చెందిన మరో ఇద్దరు కూడా సత్యనారాయణ రాజుపై ఫిర్యాదు చేశారని, ఆ దిశగా విచారణ చేపట్టామని తెలిపారు. సత్యనారాయణ రాజును ఎవరూ కిడ్నాప్ చేయలేదని అన్నారు.

ఖాళీలు చూపాలంటూ ఆందోళన

డీఈఓ డౌన్.. డౌన్.. అంటూ బాధిత టీచర్ల నినాదాలు



ధర్నా చేస్తున్న బాధిత టీచర్లు, నాయకులు

అనంతపురం విద్య, మే 28(ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ ప్రమోషన్ల కోసం ఖాళీలు 233 చూపాలని బాధిత టీచర్లు, సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం శారదా స్కూల్‌లోని బదిలీల కేంద్రం వద్ద 2023లో ఆగిన ప్రమోషన్ల ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ బాధిత టీచర్లు, పలు సంఘాల నాయకులు ధర్నా చేశారు. ఒక వైపు వెబెక్స్ జరుగుతుండగా... మరోవైపు ఆందోళనకారులు ధర్నా చేశారు. 'డీఈఓ డౌన్ డౌన్..' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అరగంటపాటు నేలపై కూర్చుని, నిరసన తెలిపారు. తర్వాత బాధిత టీచర్లు, సంఘాల నాయకులు మాట్లాడుతూ... గతంలో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లకు 230 పోస్టులు చూపిన వారు... ఇప్పుడు 19 మాత్రమే చూపుతుండటం దారుణం అన్నారు. 2025 డీఎస్సీలో రిక్రూట్‌మెంట్‌కు 103 పోస్టులు చూపిన అధికారులు ప్రమోషన్లకు 233 పోస్టులు చూపాల్సి ఉందన్నారు. 70 శాతం ప్రమోషన్ల పోస్టులు ఎక్కడికెళ్లాయని ప్రశ్నించారు. ఈ మేరకు డీఈఓ ప్రసాద్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సమస్యలను రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు సూర్యుడు, జయరాంనాయక్, చంద్రశేఖర్, శ్రీనివాస్ నాయక్, సిరాజుద్దీన్, గోపాల్‌రెడ్డి, రామాంజనేయులు, సుధాకర్, శంకరమూర్తి, నాగిరెడ్డి, కేశవరెడ్డి, ఓబులేసు, లక్ష్మీనారాయణ, ధనలక్ష్మి, విజయశ్రీ, నరసింహులు, ఓబిరెడ్డి, సూర్యనారాయణ, రసూల్ పాల్గొన్నారు.

బీఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మే 28(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఫార్మసీ పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేశారు. నాలుగో సంవత్సరం ప్రథమ సెమిస్టర్ (ఆర్ 15, 19) పరీక్షలను ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు తెలిపారు. ఎమ్మెస్సీ తృతీయ సెమిస్టర్ (ఆర్ 21) సప్లిమెంటరీ పరీక్షలు కూడా నిర్వహించామన్నారు. వాటి ఫలితాల కోసం విద్యార్థులు https://jntuaresults.ac.in/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ ప్రొఫెసర్ శివకుమార్, ఏసీఈలు శేఖర్‌రాజు, అంకారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

బదిలీలకు 231 మంది దరఖాస్తు

జడ్పీ యాజమాన్యంలో కంపల్సరీ కింద 131, రిక్వెస్టు కింద 100 మంది..

అనంతపురం విద్య, మే 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ యాజమాన్యం కింద సాధారణ బదిలీలకు 231 మంది దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం జడ్పీ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు ఒకేచోట ఐదేళ్లు పూర్తయి తప్పనిసరిగా బదిలీ కావాల్సినవారు 131 మంది దరఖాస్తు చేయగా.. ఐదుగురు వేయలేదు. రిక్వెస్టు కింద 100 మంది అప్లై చేశారు. కంపల్సరీ బదిలీల్లో సీనియర్ అసిస్టెంట్లు ఏడుగురు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు ఇద్దరు చొప్పున, రికార్డు అసిస్టెంట్లు 45 మంది, ల్యాబ్ అసిస్టెంట్లు 15 మంది, లైబ్రేరియన్ ఒకరు, ఆఫీస్ సబార్డినేటర్స్ 64 మంది ఉన్నారు. ఐదుగురు ఆఫీస్ సబార్డినేట్లకు తప్పనిసరి అయినా బదిలీలకు దరఖాస్తు చేయలేదు. రిక్వెస్టు బదిలీ కోసం ఏఓలు 13 మంది, సీనియర్ అసిస్టెంట్లు 16 మంది, జూనియర్ అసిస్టెంట్లు 29 మంది, టైపిస్టులు 9 మంది, రికార్డు అసిస్టెంట్లు 15 మంది, ల్యాబ్ అసిస్టెంట్లు ముగ్గురు, ఆఫీస్ సబార్డినేట్స్ 15 మంది అప్లై చేశారు.

బదిలీకి 9,783 మంది టీచర్ల దరఖాస్తు!

తప్పనిసరి 6,060, రిక్వెస్టు కింద 3,723.. ముగిసిన గడువు

అనంతపురం విద్య, మే 28(ఆంధ్రజ్యోతి): బదిలీలకు 9,783 మంది టీచర్లు దరఖాస్తు చేశారు. మంగళవారంతో ఆన్‌లైన్‌లో బదిలీల దరఖస్తు గడువు ముగిసింది. ఐదేళ్లు పూర్తి చేసుకున్న ప్రధానోపాధాయయులు, ఎనిమిదేళ్లు పూర్తయి టీచర్లు తప్పనిసరి బదిలీ కింద 6,060 మంది, రిక్వెస్టు కింద 3,723 మంది దరఖాస్తు చేశారు. వీరిలో ప్రైమరీ స్కూల్ టీచర్లు 208, గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులు 191, సెకండరీ గ్రేడ్ టీచర్లు 4642, స్కూల్ అసిస్టెంట్ (నాన్ లాంగ్వేజెస్) 2935, స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజెస్) 1,652, పీఈటీలు 38, లాంగ్వేజ్ పండిట్లు 117 మంది దరఖాస్తు చేసుకున్నారు.

చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లోని చీనీ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.33,770 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.3 వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 597 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

మరింత మద్దతు..!

రైతులకు కేంద్రం తీపికబురు

పలు ఖరీఫ్ పంటలకు మద్దతు ధర పెంపు

అనంతపురంరూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం.. రైతులకు తీపికబురు పంచింది. ఖరీఫ్ సీజన్‌లో పలు రకాల పంటలకు కనీస మద్దతు ధర పెంచింది. ఆ మేరకు బుధవారం పెంచిన ధరలను వెల్లడించింది. వరి క్వింటాపై రూ.69, జొన్న రూ.328, సజ్జ రూ.150, రాగులు రూ.596, వేరుశనగ రూ.480, మొక్కజొన్న రూ.175, కందిపప్పు రూ.450, పెసలు రూ.86, మినుములు రూ.400, పొద్దుతిరుగుడు రూ.441, సోయాబీన్ రూ.436, ఒలిసెలు రూ.820, పత్తి రూ.589 చొప్పున పెంచింది.

పెరిగిన మద్దతు పంట	ధర వివరాలు పాత ధర క్వింటాకి.. (రూపాయల్లో..)	ఇలా.. పెరిగిన ధర కలిపి (రూపాయల్లో..)
వరి	2,300	2,369
జొన్నలు	3,371	3,699
సజ్జలు	2,625	2,775
రాగి	4,290	4,866
వేరుశనగ	6,783	7,263
మొక్కజొన్న	2,225	2,400
కందిపప్పు	7,550	8,000
పెసలు	8,682	8,768
మినుములు	7,400	7,800
పొద్దుతిరుగుడు	7,280	7,721
సోయాబీన్	4,892	5,328
ఒలిసెలు	8,717	9,537
పత్తి	7,121	7,710

మంత్రి లోకేశ్ దృష్టికి చామలూరు స్కూల్ సమస్య

విచారణ నివేదిక ఇవ్వాలని ఆదేశాలు

అనంతపురం విద్య, మే 28(ఆంధ్రజ్యోతి): నార్పల మండలం యూపీ స్కూల్ సమస్యను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం నార్పల ఎంఈఓను రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. చామలూరు అప్పర్‌ప్రైమరీ స్కూల్‌ను ఇటీవల అధికారులు రద్దు చేసి మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్చారు. దీన్ని కేసేపల్లిలో విలీనం చేశారు. అయితే ఈ ఘటనపై గతంలో గ్రామస్థులు, తల్లిదండ్రులు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీకు, కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. 'గ్రామంలో సుమారు 2 వేల జనాభా ఉంది. యూపీ స్కూల్‌లో 6, 7, 8 తరగతుల్లో 40 మంది విద్యార్థులు ఉన్నారు. యూపీ స్కూల్‌ను మోడల్ ప్రైమరీగా మార్చి కేసేపల్లిలో విలీనం చేయడం వల్ల కేసేపల్లికి వెళ్లాంటే సుమారు 5 కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేయాల్సి ఉంది. దారి మధ్యలో వాగులు, వంకలు దాటి వెళ్లాల్సి ఉంది. దీని వల్ల పిల్లలు స్కూల్ వదిలేసి డ్రాపౌట్లుగా మారే ప్రమాదం ఉంది. సమస్య పరిష్కరించండి' అంటూ ఫిర్యాదులు వెళ్లాయి. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల గ్రామస్థుడు, విద్యార్థి తండ్రి రవికుమార్ చామలూరు స్కూల్ సమస్యను విద్యాశాఖ మంత్రికి గ్రీవెన్స్ పంపాడు. గ్రీవెన్స్ నెంబర్ ఏటీపీ 202505262558 నమోదైంది. దీంతో విచారణ చేయాలంటూ మంత్రి నుంచి కమిషనర్‌కు, తర్వాత డీఈఓకు వచ్చింది. దీంతో ఈ ఘటనపై రిపోర్ట్ ఇవ్వాలంటూ ఎంఈఓకు ఆదేశాలు వచ్చాయి.

హలో.. కలెక్టర్‌ను మాట్లాడుతున్నా..!

మీ సమస్య పరిష్కారమైందా..?.. ఫిర్యాదిదారుతో ఆరా

నిర్లక్ష్యం వహించిన అధికారులపై ఆగ్రహం

వీఆర్వో, తహసీల్దార్‌కు నోటీసుల జారీకి ఆదేశాలు

అనంతపురం టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): 'హలో.. నేను మీ కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మాట్లాడుతున్నా. మీరు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఇచ్చిన అర్జీ పరిష్కారమైందా?' అంటూ కలెక్టర్ స్వయంగా బాధితుడికి ఫోన్‌చేసి, ఆరాతీశారు. పరిష్కారం కాలేదని బాధితుడు చెప్పడంతో కలెక్టర్.. సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం చేసిన వీఆర్వో, తహసీల్దార్‌కు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. పామిడి మండలం అనుంపల్లికి చెందిన వ్యక్తి ఈ ఏడాది మార్చి 7వ తేదీన తన భూమి మరొకరు ఆక్రమించుకున్నారనీ, న్యాయం చేయాలని ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ ఇచ్చారు. దీనిపై బుధవారం కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నేరుగా కలెక్టర్.. ఫిర్యాదుదారుడికి కలెక్టర్ ఫోన్ చేశారు. ఫిర్యాదు పరిష్కారం అయిందా అని ఆరాతీశారు. పరిష్కారం కాలేదనీ, ఎవరూ పట్టించుకోవట్లేదని అర్జీదారుడు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సంబంధిత వీఆర్వోకి ఫోన్ చేసి, ఫిర్యాదు పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. సరైన సమాధానం ఇవ్వలేదు. తర్వాత పామిడి తహసీల్దార్‌కు ఫోన్ చేయగా.. ఆయన కూడా నీళ్లు నమిలారు. దీంతో ఆయనపై కలెక్టర్ మండిపడ్డారు. వీఆర్వో జ్యోతికి షోకాజ్, తహసీల్దార్‌కు కాషన్ నోటీసు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ భూమిని బాధితుడికి వెంటనే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

1న క్రికెట్ జట్ల సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, మే 28(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీన అనంతపూర్ స్పోర్ట్స్ అకాడమీ స్టేడియంలో మహిళల అండర్-23, అండర్-19, బాలికల అండర్-15 క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి భీమలింగారెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. 2002 సెప్టెంబరు 1వ తేదీ తరువాత జన్మించిన వారు అండర్-23కి, 2006 సెప్టెంబరు 1వతేదీ తరువాత పుట్టినవారు అండర్-19కి, 2013 ఆగస్టు 31వతేదీ నుంచి 2009 సెప్టెంబరు 1వ తేదీ మధ్య జన్మించిన వారు అండర్-15 విభాగానికి అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల వారు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, క్రీడాసామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలని కోరారు.

క్రైం న్యూస్ ..

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య

ధర్మవరం రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లిపోవడంతో.. జీవితంపై విరక్తి చెందిన ఓ బొగ్గుల వ్యాపారి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మహారాష్ట్రకు చెందిన గణపత్‌భానుదాస్‌చవాన్ (41) తన భార్యతో కలిసి వచ్చి.. మండలంలోని వెంకటతిమ్మాపురం గ్రామ సమీపంలో బొగ్గుల వ్యాపారం చేసుకుంటూ జీవించేవాడు. రెండురోజుల క్రితం భార్యతో గొడవపడ్డాడు. దీంతో ఆమె మహారాష్ట్రలోని పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్థాపం చెందిన గణపత్‌భానుదాస్ బుధవారం పూరి గుడెసెలోని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి.. రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి తీవ్రగాయాలు

ధర్మవరం, మే 28(ఆంధ్రజ్యోతి): చెన్నేకొత్తపల్లి నుంచి ధర్మవరానికి బుధవారం రాత్రి వస్తున్న ఆటోకు పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం వద్ద కుక్క అడ్డురావడంతో.. తప్పించబోయి ఆ వాహనం బోల్తాపడింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ధర్మవరం వాసులు రాములమ్మ, రాజమ్మ, క్రిష్టమ్మ, మూర్తి, జుబేరులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో మూర్తి పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి..

ముదిగుబ్బ, మే 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాలుగు మోరీల సమీపంలో బుధవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ఇద్దరు గాయపడ్డారు. పొడరాళ్ళపల్లికి చెందిన సాయి, టీఎన్ పాళ్యంకు చెందిన చింటూ ద్విచక్ర వాహనంలో ముదిగుబ్బ నుంచి కదిరి వైపు బైక్‌పై బయలుదేరారు. నాలుగు మోరీల వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో ఆ ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు.. క్షతగాత్రులను 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కొత్తచెరువు, మే 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పుట్టపర్తికి వెళ్లే ప్రధాన రహదారి సమీపంలోని పీవీ నవీన్‌కుమార్ ఇంటిలో చోరీ జరిగింది. పోలీసులకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... ఈనెల 4న తన తల్లి లక్ష్మీదేవి కంటి ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. తిరిగి ఈనెల 27వ తేదీ రాత్రి ఇంటికి రాగా.. ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని గమనించాడు. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువా, లాకర్లు తెరచి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మొత్తం 4.2 గ్రాముల బంగారు ఆభరణాలు, 24.50 తులాల వెండి ఆభరణాలు, రూ.13 వేలు చోరీ అయినట్లు గుర్తించారు. నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని.. దర్యాప్తు ప్రారంభించామని అప్ గ్రేడ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ సీఐ సురేశ్ బుధవారం తెలిపారు.

కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్టు

ధర్మవరం, మే 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన నాగచైతన్య అనే బాలుడిని కిడ్నాప్ చేసిన కేసులో పోలీసులు ఇరువురిని అరెస్ట్ చేశారు. నాగచైతన్య ఈ ఏడాది మార్చి 24 అదృశ్యమైనట్టు తల్లి సుమలత ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా అయితే అదే కాలనీకి చెందిన వెంకటరాముడు, ప్రశాంత్‌కుమార్ తమ మనవడు నాగచైతన్యను కిడ్నాప్ చేసినట్టు అతని తాత వెంకటేశ్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని.. ఆ ఇరువురిని పట్టణంలోని కాకతీయ స్కూల్ వద్ద ఉండగా అరెస్టు చేసివారిని రిమాండ్‌కు తరలించినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప బుధవారం తెలిపారు.

డ్రిప్ పైపులు చోరీ

నల్లమాడ, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చారుపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణరెడ్డి తన పొలంలో డ్రిప్‌పైపులు చోరీకి గురైనట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బోరుబావి కింద మొక్కజొన్న పంట సాగుచేశానని, బోరువద్ద ఉంచిన 40 డ్రిప్ పైపులను మంగళవారం రాత్రి చోరీకి గురైనట్లు చెప్పారు.

బండలు పగులగొట్టారని ఫిర్యాదు

నల్లమాడ, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సానేవారిపల్లి గ్రామానికి చెందిన ఇడగుట్ట సత్యం తన సొంత ఇంటి ముందు నల్ల బండలు పగలకొట్టారని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 24 రాత్రి నాగప్ప, పెద్దక్క దౌర్జన్యంగా ఆ బండలు పగలకొట్టారని, ప్రశ్నించిన తన తల్లి వెంకటమ్మపై చేయి చేసుకున్నారని పేర్కొన్నారు. దౌర్జన్యం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు జాబ్‌మేళా

ఓబుళదేవరచెరువు, మే 28(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటసాయి ఐటీఐలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ సిల్క్ డైవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎం రవీంద్ర, ప్రతినిధి శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఆమెజాన్, టాటా ఎలక్ట్రానిక్స్, డాక్టర్ రెడ్డిల్యాబరేటరీ, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్సు తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. కనీస విద్యార్హత 10 నుంచి డిగ్రీ, బిఫార్మసి, బిటెక్ కలిగి ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక

ధర్మవరం, మే 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షుడిగా ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శిగా సతీశ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. పట్టణంలో ఎన్జీ హోంలో చేతివృత్తిదారుల సమాఖ్య సమావేశం బుధవారం జరిగింది. ఇందులో నియోజకవర్గ కమిటీని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనకాయలు

అమడగూరు (కదిరి), మే 28(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలో ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేసే రైతులకు విత్తనకాయలు అందుబాటులో ఉన్నట్లు ఏఓ వెంకటరమణాచారి తెలిపారు. మండలంలో జెకె.పల్లి, అమడగూరు, మహమ్మదాబాద్, కసముద్రం పంచాయతీ రైతులకు నాలుగు వందల క్వింటాళ్లు వచ్చినట్లు చెప్పారు.

అలరించిన సాయికథ

పుట్టపర్తి, మే 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని ఈ రోడ్డు భక్తులు సాయికథ పేరిట చేపట్టిన సంగీత నృత్యం భక్తులను అలరింపచేసింది. రెండో రోజైన బుధవారమూ సాయికుల్వంతు సభామండపంలో తమిళనాడు భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ముదిగుబ్బ, మే 28(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలపై చర్చ నిర్వహించారు. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన మండల అధికారులపై జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీలు, మండల కోఆప్షన్ మెంబర్ చిన్న బాలముని, సర్పంచులు పాల్గొన్నారు.

ఎకరాకు మూడు ప్యాకెట్ల విత్తన కాయలివ్వాలి

ధర్మవరం, మే 28(ఆంధ్రజ్యోతి): ఎకరాకు మూడు ప్యాకెట్లు చొప్పున ఐదు ఎకరాలకు వేరుశెనగ విత్తనకాయలను ఇవ్వాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓ కార్యాలయ ఏఓ కతిజన్ కుబ్రాకు రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

రోడ్డుపై మురుగునీరు

పట్టించుకోని అధికారులు

ధర్మవరం రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపల్లి గ్రామంలో రహదారిపై మురు గునీరు నిల్వ ఉంటోంది. గ్రామంలో మురుగు కాలువలు లేక రోడ్డంతా నీరు పారుతోంది. ఆ నీరు ప్రభుత్వ పాఠశాల వద్ద నిల్వ ఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని ఆ గ్రామస్థులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది వాపోతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా ఆ నీరంతా అక్కడికి చేరి మడుగును తలపిస్తోందన్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.


చింతలపల్లిలో రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు

ఓడీసీ గ్రామ కమిటీ ఏకగ్రీవం


చికెన్ షానూ

ఓబుళదేవరచెరువు, మే 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఓడీచెరువు పంచాయతీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కెఎస్ మహమ్మద్‌అలీ (చికెన్‌షానూ), ఉపాధ్యక్షు డిగా బాబాసాహెబ్‌పల్లి లక్ష్మీనర్సు, ప్రధాన కార్యదర్శిగా ఆకు తోటపల్లి శివప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమ ఎంపికకు సహకరించిన మాజీ జెడ్పీటీసీ, కన్వీనర్, నాయకులు మహమ్మ బ్‌బాషా, ఆర్ఫీఖాన్, కార్యకర్తలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎందుకు కూల్చారు?

గొట్లూరు గ్రామస్థులను ప్రశ్నించిన డీఎంహెచ్‌ఓ


గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

ధర్మవరంరూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎటువంటి అనుమతులు లేకుండా కేవలం ఆ గ్రామ వైసీపీ నాయకుల అండతో గ్రామానికి చెందిన కొంతమంది ఆరోగ్య ఉప కేంద్రాన్ని కూల్చివేశారు. దీనిపై ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. అంతేకాకుండా గ్రామస్థులు కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం బుధవారం ఆ గ్రామానికి వచ్చి గ్రామ పెద్దలు, ఇరు వర్గాలతో సమావేశం నిర్వహించారు. అధికారుల అనుమతి లేకుండా ప్రభుత్వ భవనాన్ని ఎందుకు కూల్చారని నిలదీశారు. ఆరోగ్య ఉప కేంద్రానికి స్థలాన్ని చూపించాలని, లేకుంటే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ దిలీప్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబశివమ్మ, హెల్త్‌సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, ఆరోగ్యసిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

మెగా యోగా విజయవంతం



యోగా చేస్తున్న కలెక్టర్, అధికారులు

పుట్టపర్తిటౌన్, మే28(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ టీఎస్ చేతన్ నేతృత్వంలో పుట్టపర్తిలోని విద్యాగిరి రోడ్డుపై బుధవారం నిర్వహించిన మెగా యోగా కార్యక్రమం విజయవంతమైంది. ఎస్పీ రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఉన్నతాధికారులు.. దాదాపు 200 మంది పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. యోగా సాధనచేస్తే ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వండి: జేసీ

కొత్తచెరువు, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ఆర్‌అండ్‌బీ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారికి.. ఆ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించే విధంగా ముందుగా నోటీసులు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆర్‌అండ్‌బీ జేఈ వన్నూరుస్వామికి ఆదేశించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని పుట్టపర్తి, పెనుకొండ, బుక్కపట్నం రహదారులను ఆర్డీఓ సువర్ణ, తహసీల్దార్ నీలకంఠారెడ్డితో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా మారిన విగ్రహాలను ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసి అక్కడ గార్డెన్ ఏర్పాటు చేస్తామని కులసంఘాలకు తెలిపారు. అయితే ముందుగా ఆక్రమణలను తొలగించాలని, తరువాత విగ్రహాలను తామే స్వయంగా తొలగిస్తామని కులసంఘాల నేతలు జేసీకి తెలిపారు. ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి.. ఆక్రమణలను గుర్తించి.. వారికి నోటీసులు ఇవ్వాలని సూచించారు. వారు స్వచ్ఛందంగా ఆ ఆక్రమణలను తొలగించుకోవాలని, లేకుంటే వాటిని ఎక్స్‌కవేటర్లతో తామే తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధా, ఎంపీడీఓ నటరాజ్ పాల్గొన్నారు.


రోడ్డు ఆక్రమణలను పరిశీలిస్తున్న జేసీ, ఆర్డీఓ, తహసీల్దార్


ఎమ్మెల్యే పరిటాల సునీతను సన్మానిస్తున్న మార్కెట్ యార్డు డైరెక్టర్ చిగిచెర్ల రాఘవరెడ్డి, నాయకులు

ఎమ్మెల్యే పరిటాల సునీతకు ఘన సన్మానం

ధర్మవరంరూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత జన్మదినం సందర్భంగా టీడీపీ ధర్మవరం రూరల్ నాయకుడు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ చిగిచెర్ల రాఘవరెడ్డి, పోతుకుంట కొండారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కడపలో మహానాడు కార్యక్రమంలో ఉన్న ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి.. ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గజమాలతో సన్మానించి.. అభిమానం చాటుకున్నారు. వారి వెంట పట్టణ టీడీపీ మహిళ నాయకురాలు జయలక్ష్మీ, రత్నమ్మ, సుకన్య, సుబ్బు, కార్యకర్తలు ఉన్నారు.


ఎమ్మెల్యే పరిటాల సునీతకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రులు అనిత, సవిత, గుమ్మడి సంధ్యారాణి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి


కడపలో నిర్వహిస్తున్న మహానాడులో బుధవారం పాల్గొన్న తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

పరిహారం ఇచ్చేవరకు పనులు జరగనివ్వం


నేషనల్ హైవే డీఈని నిలదీస్తున్న రైతులు

ముదిగుబ్బ, మే 28(ఆంధ్రజ్యోతి): తమకు భూ పరిహారం అందేవరకూ ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి జాతీయ రహదారి 342 పనులను జరగనివ్వబోమని రైతులు తేల్చిచెప్పారు. అందులో భాగంగా వారు మూడో రోజైన బుధవారమూ ఆ పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎన్‌హెచ్ హైవే డీఈ గిడ్డయ్య అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రైతులకు అందాల్సిన పరిహారం గురించి సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. రైతులు మాట్లాడుతూ.. ఎన్నో రోజులుగా ఇలాగే చెబుతున్నారని, మాయ మాటలు చెప్పి మభ్యపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ వాల్యూ ప్రకారం పరిహారం అందకపోతే ఆత్మహత్యలు చేసుకోవడానికి సిద్ధమని, న్యాయమైన పరిహారం అందించే వరకు పనులు జరగనివ్వబోమని డీఈకి తేల్చి చెప్పారు. కార్యక్రమంలో రైతులు సోమల ప్రకాష్, విశ్వనాథ్, ప్రభాకర్, సనత్, రాగినాయుడు, హనుమంతు, హేమలత, రమణమ్మ, షాను, రాజేష్, రాజేంద్ర పాల్గొన్నారు.

సర్వేరాళ్లు తొలగించి అక్రమ నిర్మాణాలు

తనకల్లు, మే 28(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా సరిహద్దు ములకలచెరువు సమీపంలోని మండలంలోని బొంతపల్లి గ్రామంలో ములకలచెరువు వాసులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. సర్వేరాళ్లను తొలగించి మరీ అక్రమంగా నిర్మాణాలను చేపడుతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బొంతపల్లి గ్రామ రైతులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని, లేకుంటే ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.


సర్వేరాళ్లు తొలగించి చేపట్టిన నిర్మాణం

ఆర్డీటీపై ఆంక్షలు సడలించాలి

కదిరిఅర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి వస్తున్న విదేశీ విరాళాలపై కేంద్రం విధిస్తున్న ఆంక్షలను తొలగించాలని మండల ప్రజలు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక కాలేజీ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆందోళన చేపట్టారు.

● ఓబుళదేవరచెరువు: ఆర్డీటీ సేవలను కొనసాగించి నిరుపేదలకు చేయూతనివ్వాలని కోరుతూ బుధవారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి మల్లాపల్లి గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు.

● నల్లమాడ: ఆర్డీటీపై విధించిన ఆంక్షలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని దివ్యాంగులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ మనోజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఇందులో జయచంద్రారెడ్డి, జయలక్ష్మీ, రామాంజనేయులు, సునిత, పార్వతమ్మ, జయలక్ష్మీ పాల్గొన్నారు.


నల్లమాడలో వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

● ధర్మవరం: ఆర్డీటీకి మద్దతుగా స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం ఉదయం 8గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర, స్వచ్ఛంద సంస్థల కో-ఆర్డినేటర్లు పోలా ప్రభాకర్, సత్యనిర్ధారణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం అక్కడి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.



కదిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలు, ఓడీసీ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మల్లాపల్లి గ్రామస్థులు

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు 102వ జయంతి వేడుకలను పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కదిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుట్టపర్తిలోని హనుమాన్ కూడలిలో టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేశారు. ధర్మవరంలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్‌కట్ చేశారు. అలాగే పలు మండల కేంద్రాల్లో టీడీపీ నాయకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
























నల్లమాడలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

పేదల పక్షపాతి నందమూరి తారక రామారావు అని టీడీపీ నాయకులు కొనియాడారు. బుధవారం ఆయన జయంతి వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.


పెనుకొండలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు వెంకటేశ్వరరావు, కార్యకర్తలు


చిలమత్తూరులో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న మండల కన్వీనర్ రంగారెడ్డి, పార్టీ శ్రేణులు


సోమందేపల్లిలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు నీరుగంటి చంద్ర, వెంకటేశులు తదితరులు


గోరంట్లలో నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు


మడకశిర మండలం గౌడనహళ్లి గ్రామంలో ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నాయకలు


రొళ్ల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న తహసీల్దార్ షెక్షావలి, ఎంపీడీఓ నాగేశ్వర శాస్త్రి



పరిగిలో నివాళులు అర్పిస్తున్న మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఎంపీడీఓ రెడ్డప్ప తదితరులు


రొద్దంలో కేక్ కట్ చేస్తున్న మండల కన్వీనర్ నరహరి తదితరులు


పెనుకొండలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నివాళులు అర్పిస్తున్న అధ్యాపకుడు హరీష్‌బాబు తదితరులు


అగళి ఎంపీడీఓ కార్యాలయంలో పాల్గొన్న ఎంపీడీఓ యాదవేంద్ర

వివాదాస్పదంగా మారిన కోనేరు స్థలం

పట్టించుకోని అధికారులు

సోమందేపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లి సజ్జగుంట రంగనాథస్వామి ఆలయానికి సంబంధించిన కోనేరుస్థలం కొంతకాలంగా వివాదాస్పదంగా మారింది. ఆలయంలో కోనేరు రహదారికి ఆనుకుని ఉంది. సర్వేనంబరు 27-11లో 83సెంట్ల స్థలం దేవదాయశాఖకు సంబంధించిందిగా స్థానికులు పేర్కొంటున్నారు. అదే గ్రామానికి చెందిన కొంతమంది 11 సెంట్ల స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని గత కొంతకాలంగా గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఫిబ్రవరిలో కోనేరుస్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టబోతే గ్రామస్థులు అడ్డుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కోనేరు స్థలాన్ని సర్వేచేసి హద్దులు నిర్ణయించాలని అప్పట్లో వినతిపత్రం అందించారు. దీంతో కొంతకాలం సమస్య సద్దుమణిగింది. ఆక్రమణకు గురికాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దేవాలయ భూమి కాపాడాలని అధికారులకు పలుమార్లు అర్జీలు అందించారు. అయినా తీరు మారలేదు. ఆలయం ఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆక్రమణకు గురవుతున్న స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే అక్రమార్కులు కొన్నిరోజులకే బోర్డును తొలగించి గ్రామస్థులతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఇటీవల సజ్జగంట రంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన ఈఓ ఈశ్వరరెడ్డి ఆక్రమణ స్థలాన్ని పరిశీలించి అక్రమార్కులను మందలించారు. దేవాలయం స్థలం జోలికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్థులతో కలిసి మరోమారు హెచ్చరిక బోర్డును ఆయనే స్వయంగా ఏర్పాటు చేయించారు. ఈ నేపథ్యంలో గత ఆదివారం అదే సమయంలో అక్రమార్కులు కంచె ఏర్పాటుకు ప్రయత్నాలు చేయడంతో అదికాస్త వివాదంగా మారింది. దేవదాయ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నవారిపై సంబంధిత శాఖాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఆలయ అధికారి తీరుపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దేవదాయ భూమికే రక్షణ లేకపోతే సాధారణ భూముల పరిస్థితి ఏంటని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని చర్చించుకుంటున్నారు. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధితశాఖ అధికారులపై ఉందన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి చర్యలు తీసుకోలేకపోతున్నారా లేదా నిర్లక్ష్యం వహిస్తున్నారా దీని వెనుక ఉన్న కారణాలు ఏమిటో జిల్లా అధికారులు శోధించి వాస్తవాలను వెల్లడించాల్సిన ఎంతైనా ఉంది.


కోనేరు స్థలం

సర్వే చేయిస్తాం : ఈఓ ఈశ్వర్‌రెడ్డి

కోనేరు స్థలాన్ని పరిశీలించి హద్దులు నిర్ణయిస్తాం. ఆలయ స్థలాన్ని కొందరు రాజకీయం చేస్తూ చిన్న సమస్యను పెద్దదిగా చేస్తున్నారు. ఆ స్థలం ఆక్రమించినట్లు నా దృష్టికి రాలేదు. ఎవరైనా ఆక్రమించడానికి ప్రయత్నిస్తే గ్రామస్థులు సదరు వ్యక్తుల గురించి తమకు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

చిన్నపాటి వర్షానికే చిత్తడి

కొడికొండ చెక్‌పోస్టు నుంచి
పది గ్రామాలకు నిత్యం రాకపోకలు
వర్షం వస్తే తప్పని ఇబ్బందులు
పొలాలకు వెళ్లలేని దుస్థితి
బీటీ రోడ్డుగా మార్చాలని ప్రజల విజ్ఞప్తి

చిలమత్తూరు, మే 28(ఆంధ్రజ్యోతి): కొడికొండ చెక్‌పోస్టు నుంచి కోట్లోపల్లి మీదుగా కోడూరుకి వెళ్లే రోడ్డు చిన్నపాటి వర్షానికే చిత్తడవుతోంది. ఈ రోడ్డు అధ్వాన్నంగా మారడంతో సుమారు పది గ్రామాల ప్రజలు నరకయాతన ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ రోడ్డుని బీటీ రోడ్డుగా మారుస్తున్నామని హామీలు ఇచ్చినా అమలుకాలేదు. రోడ్డు అభివృద్ధి పనులు అప్పటి ప్రభుత్వంలో ఒక అంగుళం కూడా ముందుకు కదలకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశకులోనయ్యారు. ముఖ్యంగా వర్షం కురిస్తే ఈ రోడ్డుపై వెళ్లేందుకు వీలులేని పరిస్థితి నెలకొంటుందని పలువురు అంటున్నారు.

పది గ్రామాలకు సౌకర్యంగా..

కొడికొండ చెక్‌పోస్టు నుంచి కోట్లోపల్లి మీదుగా చిన్నప్పరెడ్డిపల్లి, మదురేపల్లి, కందూరుపర్తి, కోడూరు, సుబ్బరావుపేట, చాగలేరు తదితర గ్రామాలకు ఈ రోడ్డు ఉపయోగపడుతోంది. ప్రధానంగా 44వ జాతీయ రహదారిలోకి వెళ్లకుండా ఈ గ్రామాల నుంచి నేరుగా కొడికొండ చెక్‌పోస్టుకు చేరుకునే వెసులుబాటు ఉంది. దీంతో ట్రాఫిక్ నుంచి, ప్రమాదాల నుంచి రక్షించుకోవడం కోసం ఎక్కువ మంది ప్రయాణికులు ఈ రోడ్డు మీదుగానే కొడికొండ చెక్‌పోస్టుకి ప్రయాణిస్తుంటారు. అంతేకాకుండా ఈ రోడ్డు ద్వారా ప్రయాణిస్తే పైగ్రామాల నుంచి కొడికొండ చెక్‌పోస్టుకి తక్కువ సమయంలో సురక్షితంగా చేరుకునే సౌలభ్యం ఉంది. అయితే ఏళ్లు గడుస్తున్నా ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.


అధ్వాన్నంగా మారిన కొడికొండ చెక్‌పోస్టు నుంచి కోట్లోపల్లి, కోడూరుకి వచ్చే లింక్ రోడ్డు

ఇబ్బందుల్లో అన్నదాతలు..

ఈ రోడ్డు ద్వారా రైతులు తమ పొలాలకు వెళ్లడం, పొలాల్లో పండిన ధాన్యం, పంటలను మార్కెట్‌కి, ఇళ్లకు తీసుకెళ్లడం చేస్తుంటారు. అయితే వర్షాలు కురవడం మొదలవగానే రోడ్డు కోతకు గురికావడం, గుంతలమయమడం జరుగుతోంది. ఈ కారణంగా రైతులు తమ సేద్యపు పనుల కోసం పొలాలకు వెళ్లేందుకు నానా తంటాలు పడుతున్నారు. రోడ్డు కోతకు గురికావడంతో ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పొలాలకు ఎరువుల బస్తాలు తీసుకెళ్లాలన్నా, కూలీలను పొలాలకు తరలించాలన్నా కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీటీ రోడ్డుగా మార్చాలని...

కొడికొండ చెక్‌పోస్టు, కోట్లోపల్లి రోడ్డుని బీటీ రోడ్డుగా మార్చాలని పది గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డుని బీటీ రోడ్డుగా మార్చుతున్నట్లు ప్రకటించారని, అయితే ఐదేళ్లు గడిచినా ఊసే లేదని అంటున్నారు. అప్పటి నుంచి ఎన్నో దఫాలుగా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతులు అందజేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ముందుకు వచ్చి ఈ రోడ్డుని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసి పది గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని కోరుకుంటున్నారు.

నేడు కౌన్సిల్ మీట్

పెనుకొండ, మే 28(ఆంధ్రజ్యోతి): పెనుకొండనగర పంచాయతీ సాధారణ కౌన్సిల్ సమావేశం గురువారం ఉదయం 11గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సతీష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఆర్డీటీని పరిరక్షించాలని వినతి

గోరంట్ల, మే28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారసింపల్లికి చెందిన బీసీ, ఎస్టీ, ఎస్సీ మహిళలు ఆర్డీటీ సంస్థను పరిరక్షించాలని తహసీల్దార్ మారుతికి బుధవారం వినతిపత్రం అందించారు. గ్రామీణ పేదలకు సౌకర్యాలు కల్పిస్తున్న ఆర్డీటీకి ప్రభుత్వం ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యూవల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల నిర్మించండి: ఏఐఎస్ఎఫ్

పరిగి, మే28(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ జూనియర్‌కళాశాలను నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి బుధవారం తహసీల్దార్ హసీనాసుల్తానాకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా దాదాపు 15 ఉన్నత పాఠశాలలుండగా వాటిలో ప్రతి యేడాది 600నుంచి 700దాకా విద్యార్థులు బయటకు వస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని కళాశాలను నిర్మించి, హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట అభిషేక్, కార్తీక్, వర్ధన్ తదితరులు ఉన్నారు.

లింగ వివక్షపై అవగాహన

పరిగి, మే 28(ఆంధ్రజ్యోతి): లింగ వివక్షపై మోదా గ్రామంలో హెచ్ఈఓ వన్నూరప్ప ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భనిర్ధారణ పరీక్షలు చేయరాదని హెచ్చరించారు. వాటిని ప్రోత్సహిస్తే జైలుశిక్షతోపాటు రూ.10వేల జరిమానా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు లక్ష్మీదేవి, చంద్రకళ, శ్రీదేవి, ఆశావర్కర్లు ఈశ్వరమ్మ, గిరిజమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అగళి, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూడి గ్రామంలో బుధవారం కర్ణాటకకు దేవరాజు అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో ఎస్ఐ వీరేష్ సిబ్బందితో కలిసి దాడిచేసి పట్టుకున్నారు. అరెస్టుచేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'ఉచిత న్యాయ సహాయాన్ని పొందండి'

హిందూపురం, మే28(ఆంధ్రజ్యోతి): జైలులో శిక్ష అనుభిస్తున్న ఖైదీలు ఉచిత న్యాయసేవా సదస్సును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ సూచించారు. బుధవారం స్థానిక సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. ఎవరైనా న్యాయవాదులను పెట్టుకునే స్థోమతలేకపోతే కోర్టు ద్వారా ఉచిత న్యాయసేవను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాసరెడ్డి, సిద్దు, పార్వతి, సంతోష్‌కుమారి, ఈశ్వరప్ప పాల్గొన్నారు.


సబ్‌జైలులోని వంటగదిని పరిశీలిస్తున్న రాజశేఖర్

'మహానాడుకు తరలిరండి'

పెనుకొండ టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): మహానాడులో ఆఖరిరోజు పాల్గొనేందుకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కన్వీనర్ శ్రీరాములు తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి దాదాపు వంద బస్సులు బయలుదేరి వెళ్తాయని, వచ్చేవారికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకే పెనుకొండ నుంచి శ్రీకృష్ణదేవరాయల వైజంక్షన్, సోమందేపల్లి, గోరంట్ల మీదుగా వెళ్లడం జరుగుతుందన్నారు.

మహానాడుకు తరలిన నాయకులు, కార్యకర్తలు


అగళి నుంచి మహానాడుకు వెళ్తున్న నాయకులు

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మహానాడుకు గోరంట్ల నుంచి టీడీపీ నాయకులు బుధవారం వెళ్లారు. టీడీపీ జిల్లా కార్యదర్శి దేవా నరసింహప్ప, మండల కార్యదర్శి అశ్వత్థరెడ్డి, నీలకంఠారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు.

అగళి(ఆంధ్రజ్యోతి): మండల జడ్పీటీసీ ఉమేష్, కన్వీనర్ కుమారస్వామి ఆధ్వర్యంలో మహానాడుకు కార్యకర్తలు తరలివెళ్లారు.

గుడిబండ(ఆంధ్రజ్యోతి): మహానాడుకు గుడిబండ నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, నాయకులు, లక్ష్మీనరసప్ప, భీమరాజు, షబ్బీర్ తదితరులతో కలిసి వెళ్లారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెనుకొండ రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టూరు జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా 1988-1993 సంవత్సరం విద్యార్థులు పాఠశాలలో కలిశారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం మాధవరెడ్డి, ఉపాధ్యాయులు హనుమంతరెడ్డి, లీలావతమ్మ తదితరులు పాల్గొన్నారు.


మొమెంటోలతో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

జనన, మరణాల నమోదులో నిర్లక్ష్యం వద్దు

జిల్లా నోడల్ అధికారి కళాధర్


జనన, మరణాల రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి

చిలమత్తూరు, మే 28(ఆంధ్రజ్యోతి): జనన మరణాల నమోదులో ఎలాంటి నిర్లక్ష్యం తగదని ఆరోగ్య సిబ్బందికి జిల్లా నోడల్ అధికారి కళాధర్ సూచించారు. ఆయన బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జనన మరణాల నమోదు రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోందని, కారణాలను డాక్టర్ తేజశ్వనితో అడిగి తెలుసుకున్నారు. గర్భిణిలకు అందుతున్న వైద్య సేవలు, ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జయచంద్ర కుమార్, పీహెచ్ఎన్ లీలావతి తదితరులు ఉన్నారు.

వేతనం కోసం వాగ్వాదం


కార్యదర్శిని మందలిస్తున్న ఎంపీడీఓ వెంకటలక్ష్మి

సోమందేపల్లి, మే28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగోడు పంచాయతీ సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్ఎం గీత తనకు జనవరి, మార్చి నెలలకు సంబంధించిన జీతం బిల్లులు పెట్టకుండా కార్యదర్శి కేశవమూర్తి వేధిస్తున్నాడని వాగ్వాదానికి దిగారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయానికి భర్తతో చేరుకున్న ఆమె ఈఓఆర్డీ గది వద్దకు వెళ్లారు. కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో గదిలో ఉన్న కార్యదర్శులతో గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న కన్వీనర్ వెంకటేశులు, నాయకులు చంద్ర అక్కడకు చేరుకుని ఇరువురికి నచ్చజెప్పారు. అనంతరం ఎంపీడీఓ వెంకటలక్ష్మీ ఫోన్‌చేసి సమాచారం అందించారు. అదేవిధంగా కార్యదర్శికి ఫోన్‌చేసి కార్యాలయం వద్దకు వెంటనే రావాలని సూచించారు. సంఘటనపై ఎంపీడీఓ వెంకటలక్ష్మీ తన చాంబర్‌లో కార్యదర్శి కేశవమూర్తిని పిలిపించి తీవ్రంగా మందలించారు. వెంటనేవారికి రావాల్సిన జీతం బిల్లులు పెట్టి ట్రెజరీవద్దకు వెళ్లి ఆ డబ్బులు మంజూరయ్యేలా చూడకపోతే చర్యలు తప్పవన్నారు. ఉద్యోగుల జీతాలు నిలబెడితే వారు ఎలా బతుకుతారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, కార్యదర్శి రామాంజినేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, కళాకారులు

మడకశిర టౌన్, మే28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో బుధవారం వీధినాటిక ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం, ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ దివాకర్, ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బదిరీ మాట్లాడుతూ.. ఎయిడ్స్‌రహిత సమాజ స్థాపన కోసం కృషి చేయాలన్నారు. అనంతరం అనిల్ కుమార్ కళా బృందం నాటకం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ అశ్వత్థనారాయణ, వైద్య సిబంది పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ధర్నా


ధర్నా చేస్తున్న కార్మికులు

పావగడ, మే 28(ఆంధ్రజ్యోతి): తాము వివిధ శాఖల్లో 26 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ బేసిక్‌పై పనిచేస్తున్నామనీ, ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, పౌర కార్మికులు బుధవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్నామని, తమకు ఎటువంటి పదోన్నతులుగాని, ఉద్యోగ భద్రతగాని లేకుండాపోయిందన్నారు. తమను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి షంశుద్దీన్, భాగ్యమ్మ, రేఖ, పాల్గొన్నారు.

మహానాడుకు వెళ్లేవారికి అల్పాహారం ఏర్పాటు


అల్పాహారం అందించడానికి ఏర్పాట్లు చేస్తున్న టీడీపీ నాయకులు

గోరంట్ల, మే28 (ఆంధ్రజ్యోతి): మహానాడుకు వెళ్తున్న నియోజకవర్గ టీడీపీ శ్రేణులకు గోరంట్లలో గురువారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు. మండల కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి ప్రత్యేక బస్సుల్లో వస్తున్న కార్యకర్తలు నాయకుల కోసం జీనవాండ్లపల్లి మారెమ్మ ఆలయం సమీపంలో అల్పాహారం ఇవ్వనున్నారు.

జీవో 77ను రద్దుచేయాలి: పీడీఎస్‌యూ

హిందూపురం, మే 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో తీసుకొచ్చిన జీఓ-77ను రద్దుచేయాలంటూ పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎన్జీఓ కార్యాలయంలో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ శాస్త్రీయ విద్యాసాధనకు కృషిచేస్తామన్నారు. రెడ్‌బుక్‌ను ఓపెన్ చేయాలంటూ మంత్రి నారా లోకేశ్‌ను డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్రలో విద్యారంగ సమస్యలపై లోకేశ్ ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓపీడీఆర్ శ్రీనివాసులు, వీరేంద్రప్రసాద్ పాల్గొన్నారు.